# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ శనివారం 07 ఫిబ్రవరి 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 170
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD








## ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి




## ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ విచారణ

పిటిషన్లపై తాజాగా సుప్రీం మరోమారు విచారణ

మూడు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం



# ఎన్‌కౌంటర్‌లో కామారెడ్డి మావోయిస్ట్ మృతి

నాగపూర్:మహారాష్ట్రలోని గడ్చిరోలిలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ఘటనలో ఇప్పటి వరకు ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. భమ్రాగఢ్ తాలూకా ఫడేవా అటవీప్రాంతంలో గురువారం నుంచి భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు జరుగుతున్నాయి. నిన్న ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా, ఇవాళ మరో నలుగురి మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో గడ్చిరోలి డివిజన్ కమిటీ ముఖ్య నేత ప్రభాకర్ ఉన్నట్టు గుర్తించారు.

అతడి స్వస్థలం తెలంగాణలోని కామారెడ్డి. మావోయిస్టు ప్రభాకర్‌పై రూ. 50లక్షల రివార్డు ఉందని పోలీసులు వెల్లడించారు. ఎదురుకాల్పుల్లో ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి ఒక ఏకే-47 రైఫిల్‌తో సహా పలు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.




# హైదరాబాదు నగర అభివృద్ధికి రెండేళ్లలో 20వేల కోట్లు

మహానగరం ప్రపంచంలో మేటి నగరాలతో పోటీ పడుతుంది

27 మునిసిపాలిటీల విలీనం చారిత్రాత్మక నిర్ణయం

ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షో లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ మహానగరం చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయడం ఓ చారిత్రాత్మక నిర్ణయమని డిప్యూటీ సీఎం అభివర్ణించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు

# గెలుస్తాం



### పన్నుల్లో ప్రజలకు వెసలుబాటు కల్పిస్తాం

### కోతులు, కుక్కల బెడదను నివారిస్తాం

### మేనిఫెస్టో విడుదల చేసిన బిజెపి అధ్యక్షుడు రామ్

హైదరాబాద్: తెలంగాణలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో భాజపా విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. భాజపా విజయం సాధిస్తే పెండింగ్‌లో ఉన్న పన్నుల్లో వెసులుబాటు కల్పిస్తామని, మోడ్రన్ మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తామన్నారు. అవినీతి రహిత మున్సిపాలిటీలే తమ లక్ష్యమని.. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాలపై ఉక్కు పాదం మోపడంతో పాటు యువతకు వాకింగ్ ట్రాక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను అధికారికంగా విడుదల చేశారు.ప్రధాన అంశాల్లో కోతులు, కుక్కల బెడద నివారణను చేర్చారు.ం

పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. మున్సిపల్ ఎన్నికల రాష్ట్ర సహ ఇన్‌ఛార్జిలు అశోక్ పర్ణామి, రేఖాశర్మతో కలిసి వికసిత తెలంగాణ.. భాజపా సంకల్ప పత్రం పేరుతో మున్సిపల్ ఎన్నికల మేనిఫెస్టోను రామచందర్ రావు విడుదల చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు భాజపాను చూసి భయపడు తున్నాయని అని రామచందర్ రావు అన్నారు.



# బిజెపి, బిఆర్ఎస్‌లను నమ్ముకుంటే నట్టేట ముంచుతారు

నిజామాబాద్ రైతుల పోరాటం ఆదర్శం

కెసిఆర్‌కు దత్తపుత్రుడిగా మారిన కిషన్ రెడ్డి

అందుకే కెసిఆర్, కెటిఆర్‌లను కాపాడుతున్నాడు


కాళేశ్వరంపై సిబిఐ విచారణకు ఆదేశించినా పట్టించుకోని కేంద్రం

ధర్మపురి అర్వింద్‌తో జిల్లాకు ఒరిగింది శూన్యం

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం

నిజామాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి

కాళేశ్వరంలో ప్రాజెక్టులో అవినీతి జరిగిందని భాజపా చెప్పింది. ఆ కేసును సీబీఐకి అప్పగించాం ఏమైంది? కేసీఆర్, కేటీఆర్‌ను ఎప్పుడు అరెస్టు చేస్తారని భాజపాని అడుగుతున్నానని మరోమారు ప్రశ్నించారు. కెసీఆర్, కేటీఆర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారు. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని సీఎం విమర్శించారు. దత్తపుత్రుడు కిషన్ రెడ్డి, దొంగ పుత్రుడు కేటీఆర్ కలిసి కేసీఆర్ ను కాపాడుతున్నారుని ఆరోపించారు.



నిజామాబాద్: నిజామాబాద్ రైతుల పోరాటం దేశానికే ఆదర్శమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని వ్యవసాయం తెలంగాణకే కాదు, దేశానికే ఆదర్శమన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అదనపు నిధులు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. నిజామాబాద్ జిల్లా బర్దిపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ సూచనలతో ఈ జిల్లాలో అభివృద్ధి పనులు చేస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నాం. మన వాళ్లు కార్పొరేటర్లుగా ఉంటే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నేను అందరివాడిని. నాకు కులం, మతం లేదు. ఈ జిల్లా గొప్ప నాయకులను అందించింది. మున్సిపల్ ఎన్నికల్లో విలక్షణమైన తీర్పు ఇవ్వాలి. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిజామాబాద్ మురికి కూపంగా మారిందని మండిపడ్డారు. ధర్మపురి అర్వింద్‌ను ఎంపీగా రెండుసార్లు గెలిపించినా.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదు. మోదీ మూడు సార్లు ప్రధానమంత్రి అయినా.. నిజామాబాద్ స్మార్ట్ సిటీ కాలేదు. మోదీ దగ్గర ఎంపీ అర్వింద్‌కు పరపతి ఉంటే నిజామాబాద్‌ను ఎందుకు స్మార్ట్ సిటీగా ప్రకటించలేదని ప్రశ్నించారు. కాళేశ్వరంలో ప్రాజెక్టులో అవినీతి జరిగిందని భాజపా చెప్పింది. ఆ కేసును సీబీఐకి అప్పగించాం ఏమైంది? కేసీఆర్, కేటీఆర్‌ను ఎప్పుడు అరెస్టు చేస్తారని భాజపాని అడుగుతున్నానని మరోమారు ప్రశ్నించారు. కెసీఆర్, కేటీఆర్‌ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కాపాడుతున్నారు. కిషన్‌రెడ్డి.. కల్వకుంట్ల కిషన్‌రావుగా మారారని సీఎం విమర్శించారు. దత్తపుత్రుడు కిషన్ రెడ్డి, దొంగ పుత్రుడు కేటీఆర్ కలిసి కేసీఆర్ ను కాపాడుతున్నారుని ఆరోపించారు. కాళేశ్వరం కేసు సీబీఐ కి ఇస్తే 48 గంటల్లో కేసీఆర్ ను జైల్లో పెడతా మన్న కిషన్ రెడ్డి.. కాళేశ్వరం కేసును బీజేపీ ఎందుకు ముందుకు సాగనీయడం లేదు.

. సీబీఐ విచారణ చేయాలని కోరినా ఇప్పుడు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దొందు దొందే ..నిజామాబాద్ జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్ లను గెలిపిస్తే అభివృద్ధి జరగదని అన్నారు. బీజేపీనుంచి ఇద్దరు కేంద్ర మంత్రులన్నా.. నిధులు తెచ్చింది నిల్ అన్నారు. జిల్లా అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు గెలవాలంటే కాంగ్రెస్ ను గెలిపించుకోవాలన్నారు. అభివృద్ధే లక్ష్యంగా నిజామాబాద్ జిల్లాలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశాం.. ఒక కార్పొరేషన్, ఏడు మున్సిపాలిటీలలోవెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు



# కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బతుకులు బాగుపడతాయి

బీజేపీని కార్మికులు, పేదల వ్యతిరేక పార్టీ అని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ సీఎం అన్న విషయాన్ని మర్చిపోయి ఏదేదో మాట్లాడుతున్నారని.. సీఎం మాట్లాడే భాష తగినది కాదన్నారు. కేసీఆర్‌ను బూతులు తిడుతున్నారని మండిపడ్డారు.

జిన్నారంను మున్సిపాలిటీ చేసి భారం మోపిన కాంగ్రెస్

పన్నుల భారం మోపినోళ్లకు ఓటేద్దామా చెప్పండి

మున్సిపల్ ప్రచారంలో నిలదీసిన హరీష్ రావు

పెన్షన్‌ను 4 వేల రూపాయలకు పెంచుతామని బాండ్ పేపర్‌పై రాసిచ్చినా అమలు కాలేదన్నారు. కళ్యాణ లక్ష్మి కోసం కేసీఆర్ ఇచ్చిన లక్షా 116 రూపాయల కంటే రేవంత్ తులం బంగారం అదనంగా ఇస్తానని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఫ్రీ బస్సు పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారని.. పురుషుల బస్సు ఛార్జీలను డబుల్ చేశారని విమర్శించారు. ఇస్నాపూర్‌లో గత రెండేళ్లలో గజం రోడ్డు కూడా వేయలేదని, చిన్న డ్రైనేజీ కూడా కట్టలేదన్నారు.

సంగారెడ్డి:కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే జిన్నారంను మున్సిపాలిటీ చేసి మీ మీద పన్నుల భారం మోపిందని, ఇప్పుడు ఎవరికి ఓటేద్దాం..? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్‌రావు ఓటర్లను ప్రశ్నించారు. మనల్ని మంచిగా చూసుకున్న వాళ్ళకు, మన భారాన్ని తగ్గించే వాళ్ళకే ఓటేద్దామని అన్నారు. హరీష్‌రావు పటాన్‌చెరువు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీలో శుక్రవారం పర్యటించారు. జిన్నారం గ్రామం వాకిటి వద్ద స్థానికులతో ముచ్చటించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును ఎండగట్టారు. తాము అధికారంలో ఉన్నప్పుడు జిన్నారం గ్రామం గ్రామపంచాయతీగానే ఉండాలని కోరుకున్నామని, మున్సిపాలిటీ అయితే ప్రజల మీద పన్నుల భారం పడుతుందని ఆపామని చెప్పారు. కానీ కేసీఆర్ రూ. 200 ఉన్న పెన్షన్‌ను రూ. 2000

- మిగతా 2వ పేజీలో

వేగుచుక్క

## నెయ్యి కల్తీపై నాలుగు నివేదికలు

అమరావతి: రాష్ట్రంలో కల్తీ రిక్రూట్‌మెంట్ బోర్డును జగన్ స్థాపించారని హోం మంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. కల్తీ పాలనతో మహాపాపం చేసి ఎదురుదాడి చేయడానికి సిగ్గనిపించట్లేదా అని ప్రశ్నించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని ఒకటి కాదు రెండు కాదు నాలుగు నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. అందులో సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదిక 2022లో వైకాపా హయాంలో వచ్చిందే అన్నారు. సీఎఫ్‌టీఆర్‌ఐతో పాటు ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్‌ఐ, సిట్ నివేదికలు అన్నీ కల్తీని ధ్రువీకరించాయని స్పష్టం చేశారు. జంతు కొవ్వు అవశేషాలు నిర్ధారించే సామర్థ్యం తమ వద్ద లేదని మాత్రమే ఎన్‌డీఆర్‌ఐ చెబితే.. దానిని పట్టుకుని జంతుకొవ్వు లేదని ప్రచారం చేసుకుంటారా అని మండిపడ్డారు. లడ్డూలో కల్తీ జరగలేదనటానికి తాడేపల్లి ప్యాలెస్‌లో ముద్రించే సాక్షి కరపత్రం కాకుండా మరేదైనా నివేదిక వైకాపా వద్ద ఉందా అని ప్రశ్నించారు. టాయిలెట్ క్లీనింగ్‌కు వాడే 'లబ్సా' అనే రసాయనం వాడి మహా అపచారానికి ఒడిగట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాయ్ హత్యకు ముందు ఎలాంటి మైండ్ గేమ్ ఆడారో.. కల్తీ నెయ్యి వ్యవహారంలోనూ అలాంటి మైండ్ గేమ్ ఆడుతున్నారని ధ్వజమెత్తారు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్న ఇలాంటి వారిని రాజకీయాల్లో లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని హోం మంత్రి అన్నారు. ఇంత జరిగినా కనీసం పాశ్చాత్తాపం ప్రకటించడం లేదన్నారు. ఎదురుదాడితో ఏం సాధిస్తారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ వ్యవహారాన్ని తొక్కిపెట్టి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని, ఇది క్షమించరాని మహా పాపం అని ఆమె అభివర్ణించారు. దేవుడితో చెలగాటమాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

## హడలెత్తిస్తున్న పెద్దపులి సంచారం

రాజమండ్రి: రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో పులి సంచారం కలకలం రేపుతోంది. రాజానగరం మండలం జి.ఎర్రంపాలెం కృష్ణయ్య కాలనీ సమీపంలోని పొలాల్లో పులి తిరుగుతున్నట్లు సమాచారం రావడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. గత ఆరు రోజులుగా పులి దాడుల్లో పశువులు మృతిచెందడంతో, ప్రజల భద్రత దృష్ట్యా అటవీ శాఖ 'ఆపరేషన్ టైగర్'ను ముమ్మరంగా కొనసాగిస్తోంది. ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ మూర్తి నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. పులి జాడను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. అటవీ శాఖకు చెందిన అనుభవజ్ఞులైన సిబ్బంది పొలాలు, అటవీ ప్రాంతాలు, పశువుల దాడులు జరిగిన ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపడుతున్నారు.రాజమండ్రి పరిసరాల్లో కొనసాగుతున్న ఈ ఆపరేషన్‌పై స్థానికంగా ఉత్కంఠ నెలకొంది. అత్యాధునిక సాంకేతికత, నిపుణుల బృందం, అటవీ శాఖ సమన్వయంతో పులిని త్వరలోనే పట్టుకుంటామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సహకారంతో ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతం చేస్తామని తెలిపారు. పులి రెస్క్యూ ఆపరేషన్‌ను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు పూణెళి నుంచి ఐదుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక నిపుణుల బృందం రాజమండ్రికి చేరుకుంది. ఈ బృందం నిన్న(గురువారం) రాత్రి 8:30 గంటల నుంచి అధికారికంగా టైగర్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. అడవి జంతువుల పట్టివేతలో అనుభవం కలిగిన ఈ బృందం అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. పులి కదలికలను గుర్తించేందుకు అటవీ శాఖ అధికారులు.. కీలక ప్రాంతాల్లో 25 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి వెళ్లే అవకాశమున్న దారులు, పశువుల దాడులు జరిగిన ప్రాంతాలు, నీటి వనరుల సమీపంలో ఈ కెమెరాలను అమర్చారు. వీటివల్ల పులి ఎక్కడ తిరుగుతుందో స్పష్టమైన సమాచారం లభించనుంది.పులి కదలికలను తక్షణమే గుర్తించేందుకు పది 4ఉ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఈ కెమెరాలను నేరుగా అధికారుల ఫోన్లకు అనుసంధానం చేశారు. దీంతో పులి కదలికలు నమోదైన వెంటనే సిబ్బందికి అలర్ట్ మెసెజ్ వస్తోంది. ఇది రెస్క్యూ ఆపరేషన్‌ను వేగవంతం చేయడంలో కీలకంగా మారింది.

## ఇస్లామబాద్‌లో ఆత్మాహుతి దాడి

**సుమారు 25మంది దుర్మరణం**

ఇస్లామాబాద్ పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. షెహజాద్ టౌన్ ఏరియా టేర్లాయి ఇమామ్ బారగాహ్ వద్ద జరిగిన ఈ పేలుడులో సుమారు 25మంది మరణించగా.. 80 మందికి పైగా గాయపడినట్టు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు చెబుతున్నారు. ఇది ఆత్మాహుతి బాంబర్ దాడిగా అనుమానిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పెద్దఎత్తున భద్రతా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకుని తక్షణ సహాయక చర్చలు చేపట్టాయి. క్షతగాత్రులను పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలిస్తున్నారు. ప్రస్తుతం సహాయక చర్చలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాడు ప్రార్థనల అనంతరం ఈ ఆత్మాహుతి దాడి జరిగినట్టు చెబుతున్నారు. ఇది బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) పనిగా అనుమానిస్తున్నారు. దాడి నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో అత్యవసర పరిస్థితిని అధికారులు ప్రకటించారు. గత మూడు నెలల్లో ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడులు జరగడం ఇది రెండోసారి. గతేడాది నవంబర్‌లో ఇస్లామాబాద్ జిల్లా జ్యుడిషియల్ కాంప్లెక్స్ వద్ద జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది మరణించగా.. 27 మంది గాయపడ్డారు.

## టిటిడి ఇవోగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతలు

తిరుమల:తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా సీఎంవో ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం సతీసమేతంగా భూవరాహ స్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లిన ఆయన.. రంగనాయకుల మండపంలో ఇన్‌ఛార్జ్ ఈవోగా బాధ్యతలు స్వీకరించి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి భక్తుడిగా ఎంతో మందికి సేవచేసే భాగ్యం దక్కిందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వం, భక్తుల నమ్మకాన్ని నిలబెడతానని స్పష్టం చేశారు. టీటీడీ బోర్డు, అధికారులతో పాటు అందరి సలహాలు, సూచనలు తీసుకుని సమన్వయంతో ముందుకు సాగుతానన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా ఉండేలా పరిపాలన కొనసాగిస్తానని చెప్పారు. తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం.. టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా ఉంటూనే టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవో బాధ్యతలనూ రవిచంద్ర నిర్వర్తించనున్నారు .

# హైదరాబాదు నగర అభివృద్ధికి రెండేళ్లలో 20వేల కోట్లు



హైదరాబాద్: హైదరాబాదు నగరాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాల వ్యవధిలోనే 20వేల కోట్లు కేటాయించాం, ఇందులో అనేక పనులు పూర్తికాగా మరికొన్ని పనులు ప్రగతిలో ఉన్నాయని, ఈ తరహాలో హైదరాబాదు నగర అభివృద్ధికి నిధులు కేటాయించడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగలేదని డిప్యూటీ సీఎం తెలిపారు. శుక్రవారం హైటెక్స్ లో క్రెడాయ్ ప్రాపర్టీ ఎగ్జిబిషన్ షో సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జిహెచ్ఎంసి పరిధిలో 1950.52 కోట్లు, మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు పరిధిలో 12,500 కోట్లు, నగర పరిధిలో 4,3365 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. హైదరాబాదు నగరం పెట్టుబడులు, ప్రతిభ, జీవన ప్రమాణాల్లో నాణ్యత విషయంలో దేశంలోని నగరాలతోనే మాత్రమే కాదు ప్రపంచంలోని అగ్ర నగరాలతో హైదరాబాద్ మహానగరం పోటీ పడుతుందని డిప్యూటీ సీఎం వివరించారు. హైదరాబాద్ మహానగరం చుట్టుపక్కల ఉన్న 27 పట్టణ స్థానిక సంస్థలను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయడం ఓ చారిత్రాత్మక నిర్ణయమని డిప్యూటీ సీఎం అభివర్ణించారు. ఈ గొప్ప నిర్ణయం ద్వారా నగరంలోని పౌరులకు ఒకే విధమైన పౌర సేవలు, సమగ్ర ప్రణాళిక, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఒకే అభివృద్ధి దృక్పథం సాధ్యం అయ్యాయి అన్నారు. ఈ రోజు హైదరాబాద్ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, పెట్టుబడులకు అనుకూలమైన నగరాలలో ఒకటిగా నిలుస్తోంది. ఇది యాదృచ్ఛికంగా జరిగినది కాదు. దశాబ్దాల పాటు సాగిన సంస్థాగత నిర్మాణం, ప్రజాస్వామ్య పాలన, మరియు సమగ్ర అభివృద్ధిపై ప్రజా ప్రభుత్వం నిబద్ధత ఫలితమే ఇది అన్నారు. ఈ రోజు మన అభివృద్ధి గతంలోని దూరదృష్టి గల నాయకత్వం వేసిన బలమైన పునాదులపై నిలబడి ఉంది, ప్రస్తుత ప్రభుత్వం పారదర్శకత, బాధ్యతాయుత పాలన, ప్రజాకేంద్రిత పాలనపై పెట్టిన దృష్టి ఈ పునాదులను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. నగరాభివృద్ధి అనేది న్యాయమైనది, సమతుల్యమైనది, అందరికీ అందుబాటులో ఉండాలనే మా నమ్మకాన్ని మున్సిపాలిటీల విలీనం ప్రతిబింబిస్తుంది అన్నారు.
÷–రజలు ఎక్కడ నివసిస్తున్నారనే అంశంతో సంబంధం లేకుండా ఈ రోజు హైదరాబాద్‌ను విడివిడిగా ఉన్న
సంపన్న ప్రాంతాల సమాహారంగా కాదు, ఒకటిగా అనుసంధానమైన, సమగ్రంగా అభివృద్ధి చెందుతున్న మహానగరంగా తీర్చిదిద్దుతున్నాం అని వివరించారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రోగ్రాం కింద, 7,032 కోట్లకు పైగా పెట్టుబడితో 45 ప్రధాన ఫ్లై ఓవర్లు, అండర్‌పాసులు మరియు 10 రోడ్డు విస్తరణ ప్రాజెక్టులను అమలు చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం వివరించారు. అభివృద్ధి నగరమంతటా సమతుల్యంగా సాగుతోంది అన్నారు. హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ పరిసరాల్లోని ప్రాజెక్టులు ట్రాఫిక్ రద్దీని రూ. 1090 కోట్లు వెచ్చించి నియంత్రణ పనులు చేపడుతున్నామని తెలిపారు. పడమటి కారిడార్‌లో ఎఐఎ÷ మరియు ఖాజాగూడ వద్ద రూ.837 కోట్లతో మల్టీలెవల్ ÷÷–లఓల్ల÷వర్లు నాలెడ్జ్ ఎకానమీకి తోడ్పడుతున్నాయి, మరో 70 కోట్లతో వెస్టర్న్ సిటీలో ప్రధాన రోడ్ల విస్తరణ పనులు జరుగు తున్నాయని తెలిపారు. ఉత్తర భాగంలో ఆర్మీ ఆర్డినెన్స్ సెంటర్ సమీపంలోని ప్రత్యామ్నాయ రహదారి నెట్‌వర్క్‌లు ఏళ్లనాటి ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు రూ.960 కోట్లతో పనులు చేపట్టినట్టు వివరించారు. తూర్పు హైదరాబాద్‌లో టీకేఆర్ కాలేజ్, గాయత్రి నగర్, మండమల్లమ్మ జంక్షన్ వద్ద ÷÷–లఓల్ల÷వర్లు కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు రూ 416 కోట్లతో పనులు చేపట్టినట్టు తెలిపారు.దక్షిణ భాగంలో, వేగంగా విస్తరిస్తున్న పట్టణాభివృద్ధికి రోడ్డు విస్తరణ ప్రాజెక్టులను రూ .863 కోట్లతో చేపట్టినట్టు వివరించారు. ఇది నగరమంతటా జరుగుతున్న సమిష్టి ప్రయత్నం. ఏ ప్రాంతాన్నీ నిర్లక్ష్యం చేయడం లేదు. ఏ సముదాయాన్నీ మరిచిపోవడం లేదు అని తెలిపారు.ఈ పెట్టుబడులు ప్రయాణ సమయాన్ని తగ్గిస్తు న్నాయి, లాజిస్టిక్స్‌ను మెరుగుపరుస్తు న్నాయి, ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేస్తున్నాయి, భూవిలువలను పెంచుతున్నాయి. అంతకన్నా ముఖ్యంగా విద్యార్థులు, కార్మికులు, వ్యాపార వేత్తలు, కుటుంబాలు వంటి సాధారణ ప్రజల రోజువారీ జీవితాన్ని మెరుగుపరు స్తున్నాయి అన్నారు.తెలంగాణ రైజింగ్ విజన్ 2047 కింద, రాష్ట్ర అభివృద్ధిలో కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీని కేంద్రంగా ఉంచుతోందనీ తెలిపారు. ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం, సమాన అవకాశాలతో పాటు సాగాలన్న ప్రజా ప్రభుత్వం దీర్ఘకాలిక విశ్వాసానికి ఇది ప్రతిబింబం అన్నారు.హైదరాబాద్ తెలంగాణకు ఉపాధి, ఆవిష్కరణలు, గ్లోబల్ పెట్టుబడుల ప్రధాన ఇంజిన్‌గా కొనసాగుతుంది, అదే సమయంలో అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా చూస్తుంది అని భరోసా ఇచ్చారు. అందుకే 2047 వరకు దృష్టిలో ఉంచుకుని, వరదల భద్రత, వాతావరణ అనుకూలత కోసం ప్రత్యేకంగా లోతట్టు, వెనుకబడిన ప్రాంతాలకు ఉపయోగపడేల సమగ్ర స్టార్మ్ వాటర్ మాస్టర్ ఎ÷–లాన్‌ను సిద్ధం చేస్తున్నాం అన్నారు.దీర్ఘకాలిక ప్రణాళికలు, సంస్థాగత బలోపేతం, స్థిరమైన అభివృద్ధిపై మా ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నాయి అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్ ఇతర భారతీయ నగరాలతో మాత్రమే కాదు పెట్టుబడులు, ప్రతిభ, జీవన నాణ్యత కోసం ప్రపంచంలోని అగ్ర నగరాలతో పోటీపడుతోంది అన్నారు. పోటీలో విజయం సాధించాలంటే మూలధనం, సాంకేతికతతో పాటు ప్రజాసంస్థలపై నమ్మకం, సామాజిక సౌహార్దం, రాజకీయ స్థిరత్వం కూడా అవసరం, అదంతా అందించడానికి మా ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. దేశంలోనే అత్యంత నివసించదగిన, పెట్టుబడులకు అనుకూలమైన, మంచి పాలనతో కూడిన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల మార్గనిర్దేశంలో కలిసి హైదరాబాద్‌ను నిజంగా ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దుదాం అని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సదాసిద్ధంగా ఉంది,
మున్సిపాలిటీ ఎన్నికల బిజీ ఉన్నప్పటికీ తనతో పాటు సీనియర్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సైతం ఈ సమావేశానికి హాజరు అయ్యాము అంటే ఈ రంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న ఆసక్తి ఎలాంటిదో స్పష్టం అవుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

## ఫిరాయింపుల వ్యవహారంపై స్పీకర్ విచారణ



న్యూఢిల్లీ: తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణను సుప్రీంకోర్టు మూడు వారాల పాటు వాయిదా వేసింది. న్యాయస్థానంలో తాజాగా జరిగిన విచారణలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం.. బీఆర్ఎస్, బీజేపీ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. అనర్హత పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వద్ద విచారణ ప్రస్తుతం కొనసాగుతోందని కోర్టుకు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి మరో మూడు వారాల సమయం కావాలని ఆయన కోరారు.
అసెంబ్లీ స్పీకర్‌కు ఇప్పటికే తగినంత సమయం ఇచ్చామని గతంలోనే గుర్తు చేసిన ధర్మాసనం, ఈసారి స్పీకర్ నిర్ణయం పాజిటివ్‌గా ఉండాలని స్పష్టం చేసింది. సింఘ్వీ విన్నపాన్ని మన్నిస్తూ, తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఆ సమయానికి స్పీకర్ తీసుకున్న నిర్ణయాల పూర్తి సమాచారాన్ని సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను స్పీకర్ అమలు చేయలేదని మహేశ్వర్ రెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆయన దాఖలు చేసిన ఈ ధిక్కరణ పిటిషన్‌ను కూడా ప్రధాన పిటిషన్‌తో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మూడు వారాల గడువులోగా ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. కోర్టు పర్యవేక్షణలో ఉన్న ఈ కేసు తెలంగాణ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## తప్పలను ఎత్తి చూపితే దాడులు చేస్తారా?



విజయవాడ: ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపితే.. ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?.. తగలబెడతారా..? అంటూ వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ ఫెర్ అయ్యారు.. జోగి రమేష్ ఇల్లు మొత్తం చిన్నాభిన్నం అయ్యింది.. పక్కనే ఉన్న కరెంట్ ప్లగ్స్ అంటుకుని ఉంటే ఇంట్లో ఉన్న వాళ్ళ నాన్న పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.. బీసీ నాయకుడి వాయిస్ అణగదొక్కాలని ఇలా చేయటం న్యాయమా..? అని ఆవేదన వ్యక్తం చేశారు.. రమేష్ ఇంటిపై 5 గంటలకు దాడి జరిగితే పోలీసులు, టీడీపీ నేతలు పథక రచన చేశారు.. పోలీసులు, టీడీపీ నేతలతో కలసి ప్లాన్ చేసి దాడి చేశారని విమర్శించారు.. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి వెళ్లి.. దాడి జరిగిన ఆ ఇంటిని పరిశీలించిన వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. ఆ కుటుంబాన్ని పరామర్శించారు.. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.. వారికి ధైర్యాన్ని చెప్పారు.. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ నేతలు పోలీసులను వెంటబెట్టుకుని వచ్చి దాడి చేసిన వీడియో ఫుటేజ్ లు కూడా ఉన్నాయన్న ఆయన.. పోలీసుల సమక్షంలోనే నిప్పు పెట్టారు.. దాడి చేసిన టీడీపీ నేతలు మొత్తం చంద్రబాబు, లోకేష్ కి అత్యంత సన్నిహితులే అని తెలిపారు..కళ్లు మూసుకుని తెరిస్తే రెండేళ్లు గడిచాయి.. మరో మూడేళ్లు కళ్లు మూసుకుంటే వచ్చేది మన ప్రభుత్వమే..మనం నాగరిక ప్రపంచంలో ఉన్నామా..? జంగిల్ రాజ్ లో ఉన్నామా..? అనటానికి ఇదో ఉదాహరణగా పేర్కొన్నారు వైఎస్ జగన్.. జోగి రమేష్ ఆయన మీద పెట్టిన అక్రమ కేసులో విచారణకు హాజరయ్యేందుకు వెళ్లిన సమయంలో దాడి చేశారు.. లోకల్ పోలీసులతో పాటు సీపీ ఫోన్ కూడా ఎత్తలేదు.. అంబటి రాంబాబు ఇంటి దగ్గర దహనకాండ సమయంలో కూడా పోలీసులు ఇలాగే చేశారు.. పోలీసుల సమక్షంలోనే అక్కడ కూడా దాడి జరిగిందన్నారు.. జోగి రమేష్ ఇంటిపై పెట్రోల్ బాంబులు, యాసిడ్ బాటిళ్లతో దాడులు చేయడం కూటమి ప్రభుత్వం అరాచక పాలనకు నిదర్శనమంటూ మండిపడ్డారు.. గుంటూరులో అంబటి రాంబాబు.. ఇక్కడ జోగి రమేష్ ఇంటిని ధ్వంసం చేశారు. అంబటి రాంబాబు ఇంట్లోకి చొరబడ్డారు.. విధ్వంసం సృష్టించారు. అంబటి కుటుంబ సభ్యులపై దుర్భాషలాడారు. అంబటి ఆఫీస్‌ను కూడా తగలబెట్టారు. అంబటి ఇంట్లో, ఆఫీస్‌లో జరిగిన జంగిల్ రాజ్‌ను.. జోగి రమేష్ విషయంలో కూడా కొనసాగించారని ఆవేదన వ్యక్తం చేశారు.. వచ్చేది మన ప్రభుత్వమే.. జగన్ 2.0లో అందరి లెక్కలు తేలుస్తామని హెచ్చరించారు.. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించిన ఆయన.. జోగి రమేష్ ఇల్లు మొత్తం చిన్నాభిన్నం అయ్యింది. స్థానిక పోలీసులు, టీడీపీ నేతలు కలిసి ప్లాన్ చేసి దాడి చేశారు. దాడి సమయంలో, పోలీసులు సమక్షంలోనే నిప్పులు పెట్టారు.జోగి రమేష్ విచారణ కోసం హాజరైన సమయంలోనే ఈ దాడి జరిగింది. స్థానిక పోలీసులు మరియు సీపీ ఫోన్ కూడా అందుకోలేదు. ఇటువంటి పరిస్థితి అంబటి రాంబాబు ఇంటి దగ్గర జరిగిన దహనకాండ సమయంలో కూడా కనిపించిందన్నారు వైఎస్ జగన్.. హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు ప్రతి సమస్యను తీసుకెళ్తాం.. జోగి రమేష్‌పై ఇప్పటి వరకు 12 అక్రమ కేసులు నమోదయ్యాయి. కల్తీ మద్యం కేసులో ఆయనను జైల్లో కూడా పెట్టారు. వైఎస్ జగన్ చెప్పినట్లే, పోలీసులు మరియు వర్గాల సహకారంతో ఆయనపై రాజకీయ భయం, న్యాయ హరాస్మెంట్ కొనసాగుతోంది. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు దోషులను బోన్‌లో నిలబెడతామని హెచ్చరించారు వైఎస్ జగన్..

## మొదటి పేజి తరువాయి

## కాంగ్రెస్‌ను ఓడిస్తేనే బతుకుల బాగుపడతాయి

చేస్తానని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ఆ హామీని నెరవేర్చారని చెప్పారు. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి రెండేళ్లు గడిచినా ఇవ్వడం లేదని విమర్శించారు. ఏపీలో చంద్రబాబు రూ.4000 ఇస్తానని చెప్పి ఇస్తున్నాడు కదా? మరి ఇక్కడ రేవంత్ రెడ్డికి ఎందుకు చేతులు రావడం లేదు..? అని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇస్తానని చెప్పి రేవంత్ రెడ్డి మోసం చేశాడని హరీష్‌రావు విమర్శించారు. ఈ 24 నెలల్లో ఒక్కో మహిళకు ప్రభుత్వం రూ.60,000 చొప్పున బాకీ పడిందని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు బతుకమ్మకు ప్రతి మహిళకు చీర ఇచ్చేదని, రేవంత్ రెడ్డి వచ్చాక చీర లేదు, గాజులు లేవని చెప్పారు. ఏదో గ్రూపులో ఉన్న కొద్దిమందికి ఇచ్చి చేతులు దులుపుకున్నాడని అన్నారు. ఫ్రీ బస్సు అని చెప్పి మగవాళ్లకు టికెట్ రేట్ డబుల్ చేశాడని తెలిపారు. ఆడోళ్ళకు సీటు దొరక్క తిప్పలు పడుతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి వచ్చాక 5 పంటలు వస్తే.. రెండింటికి ఇచ్చి మూడింటికి రైతుబంధు ఎగ్గొట్టాడని విమర్శించారు. నాటేసిన వాళ్లకే రైతుబంధు ఇస్తా, శాటిలైట్‌లో చూసి ఇస్తా అని కొత్త నిబంధనలు పెట్టి రైతులను గోస పెడుతున్నాడని రేవంత్‌రెడ్డిపై హరీష్‌రావు మండిపడ్డారు. దేవుడి మీద ఒట్టు వేసి రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పిన పాపాత్ముడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు. ఏ ఊర్లో చూసినా సగం మందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో మీరు కారు గుర్తుకు ఓటు గుద్దితే.. రేవంత్ రెడ్డికి గూబ గుయ్యిమనాలె అని పిలుపునిచ్చారు. అప్పుడే భయపడి హామీలైనా అమలు చేస్తాడని అన్నారు. ఓటుకు 5 వేలు ఇస్తామంటారని, అవి తీసుకొని మోసపోవద్దని హెచ్చరించారు. మహిళలకు రావాల్సిన రూ.60,000, అవ్వ తాతలకు రూ.4000 పెన్షన్ రావాలంటే బీఆర్ఎస్ గెలవాలని అన్నారు. అవ్వతాతలు పెన్షన్ అడిగితే లాగుల తొండలు ఇడిసిపెడతా అంటాడని, మహిళలు హామీల గురించి అడిగితే మెడలో పేగులు వేసుకుంటా అంటాడని, తులం బంగారం ఏదని అడిగితే గుడ్లు పీకి గోటీలు ఆడుతా అంటాడని హరీష్‌రావు సీఎంను విమర్శించారు. ప్రశ్నిస్తే కళ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి సీఎం అహంకారాన్ని దించాలని పిలుపునిచ్చారు. రెండేళ్లు ఓపిక పట్టాలని, వచ్చేది మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. జిన్నారం సమస్యలు పరిష్కరించుకుందామని చెప్పారు. రేవంత్ రెడ్డి ముస్లింలకు ఒక్క రూపాయి పని కూడా చేయలేదని, కాబట్టి అందరూ ఏకమై కారు గుర్తు అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

## బానిస భావజాలంలో విమర్శల జోరు !

గతంలో వికీ లీక్స్ కూడా ఓ ఊపు ఊపింది. విదేశాల్లో ఉన్న ఊరూపేరు లేని కొందరు పనిగట్టుకుని ప్రపంచ దేశాల్లో ఉన్నవారిపై ఊకదంపుడు, ఊహాగాన కథనాలు రాస్తుంటారు. అవన్నీ పట్టుకుని మనదేశంలో నోరు పెద్దదిచేసి అరవడం కొందరు అలవాటు చేసుకున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ ఫైల్స్ పైనా దుమారం రేపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ప్రధాని పేరు పదేపదే ప్రస్తావన కు వచ్చిందని చెబుతున్న వారు అందులో ఏముందో తెలుసుకుని మాట్లాడితే బాగుండేది. ఇదంతే ఒక ఎత్తయితే దీని కారణంగానే మోడీ అమెరికాతో ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారన్న ప్రచారం చేపట్టారు. దీంట్లో రాహుల్, లెఫ్ట్ పార్టీలు ముందున్నాయి. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్ లో రాహుల్ పేరు కూడా ఉంది. దానిని ఆయనగాని, ఆయనకు వంతపాడుతున్న వారు గానీ మాట్లాడడం లేదు. అందులో రాహుల్‌ను ఓ అసమర్థ నేతగా వర్ణించారు. అతను రాజకీయాలకు పనికి రాడని, అతని వల్ల ఒరిగేదేమీ లేదని తేల్చారు. దీనిని మరుగున పర్చి మాట్లాడుతున్నారు. కనీసం రాహుల్ కూడా దీనిని తెలుసుకుని మాట్లాడితే బాగుండేది. అలాగే రాహుల్ భారత రాజకీయాల గురించి ఎప్‌స్టీన్ ఎవడు కామెంట్ చేయడానికి అన్న ప్రశ్న వేసుకోవాలి. అలాగే మిగతా వారి గురించి కూడా అతను వ్యాఖ్యానించడానికి అతని తాహతు ఏంటన్నది కూడా ముఖ్యం. ఇక ట్రేడ్ డీల్ గురించి మాట్లాడుకుంటే ట్రంప్ ఏనాడూ భారత్‌కు అనుకూలంగా వ్యవహరించ లేదు. 50శాతం సుంకాలు బాది చెవి మెలిపెట్టాడు. మాట్లాడడానికి కూడా భారత్ ప్రధానితో ఇష్టపడలేదు. అనూహ్యంగా ఆయన మారడానికి, డ్రేడ్ డీల్ కుదుర్చుకోవాలని అనుకోవడానికి కారణాలు ఉన్నాయి. ఒకటి అమెరికాలో భారత్‌కు మద్దతుగా అక్కడి నేతలు ట్రంప్‌పై అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. భారత్‌తో వాణిజ్యం తెంపుకుంటే మనం మటాష్ అవుతామని అంటున్నారు. అలాగే యూరోపియన్ యూనియన్‌తో భారత్ ట్రేడ్ డీల్ కుదుర్చుకోవడంతో ట్రంప్‌కు దిక్కుతోచకుండా పోయింది. అలాంటి ట్రంప్ టారిఫ్‌లను 18శాతానికి తగ్గించి భారత్‌తో కాళ్లబేరానికి వచ్చాడు. ఇక్కడ మోడీ ఎక్కడ ట్రంప్‌కు లొంగిపోయాడో, ఎక్కడ భారత్‌ను తాకట్టు పెట్టారో కాంగ్రెస్, కమ్యూనిస్టులు చెప్పాలి. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా డీల్ కుదుర్చు కునేదే. రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడుతున్న వారికి దేశాం గురించి, ప్రపంచం గురించి తెలియదునుకోవాలి. రాహుల్ లాంటి విపక్ష నేత ఉన్నందుకు సిగ్గుపడాలి. ఎందుకంటే పార్లమెంట్‌లో గట్టిగా వాణి వినిపించలేకపోవడం, అల్లరి చేసి బయటకు రావడం మాత్రమే తెలిసిన అసమర్థుడు రాహుల్. ఇలాంటి వారి వల్లనే దేశ ప్రతిష్టకు మచ్చగా మారుతోంది. బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం ఎంతవరకైనా వెళ్తుందని ట్రేడ్ డీల్ గురించి పదేపదే చెబుతున్న వారు సిగ్గుతో తలదించుకోవాలి. నిజానికి ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనేకరకాలుగా అందిరి పేర్లు ఉన్నాయి. వాటికి ఆధారాలు లేవు. ఓ వికృత వ్యక్తి, వ్యవభిచారి తనకు తానుగా రాసుకున్న కథలను చూపించి అంతా అక్కసు వెళ్లగక్కుతున్నారు. ముఖ్యంగా భారత విపక్షాలు ఈ విషయంలో ముందున్నారు. ఏ సందు దొరికినా మోడీని ఆడిపోసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. నిజానికి పార్లమెంటులో ప్రజల సమస్యలను ప్రస్తావించి పోరాడాలన్న పట్టుదల లేని వారంతా ఎంపిలుగా ఉన్నారు. ప్రజల డబ్బును దోచేస్తున్నారు. పన్నుల రూపంలో కట్టిన డబ్బులను దుబారా చేస్తున్నారు. ఇవన్నీ మాట్లాడడానికి సమయం ఉండదు. ఇకపోతే ఎప్‌స్టీన్ లైంగిక నేరస్తుడిగా అంగీకరించి 18 నెలలపాటు జైలు శిక్షకు గురై, ప్రైవేట్ జెట్స్, ఐలాండ్స్ కొనుగోలు చేసే స్థాయికి ఎదిగిన జెఫ్రీ ఎప్‌స్టీన్ ప్రపంచ నేతలతో, కార్పొరేట్లతో సంబంధాలు నెరిపే బ్రోకర్. 2019లో రెండోసారి జైలుకు వెళ్లిన తరువాత ఆత్మహత్య చేసుకున్నాడని అమెరికా ప్రకటించింది. అయితే తమ సంబంధాలు బయటకు వస్తాయని ప్రముఖులే హత్య చేయించారన్నది అక్కడి మీడియా కథనం. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనకుతాను రాసుకున్న వారి పేర్లలో మోడీ, రాహుల్, కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్ పురి, ముఖేష్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ పేర్లు ఉన్నాయని సమాచారం. మరి వీరందిరికి సంబంధించి అందులో ఏముందో ఎవరికీ తెలియదు. ఆ సందర్భంగా జరిపిన ఇ మెయిల్స్‌లో పదేపదే ప్రధాని పేరు ప్రస్తావ–నకు రావడం తదితర అంశాలపై ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత కేంద్రానిదే అంటూ చిలకపలుకులు పలుకుతున్న వారికి రాజకీయ నిబద్ధత లేదనుకోవాలి. 2014 జూన్ నుంచి 2017 మే మధ్య ఎప్‌స్టీన్‌తో అనేకసార్లు మెయిల్స్, చాట్స్ చేయడంతోపాటు మూడుసార్లు స్వయంగా కలిశారు.

వేగుచుక్క

# రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలకు "సత్యశోధక్" విద్యార్థులు.

**విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందించి ప్రశంసించిన ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.**



**వేగుచుక్క న్యూస్, సిరికొండ:**

విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ లాబ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కూకట్ పల్లి పి.యస్.యం. ఉన్నత పాఠశాలలో ఈనెల 8న (ఆదివారం) జరిగే రాష్ట్ర స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన 7గురు విద్యార్థులు ఎంపికయ్యారు.గత సంవత్సరం డిసెంబర్ 30న ఆర్మూర్ పట్టణ కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ వివిధ విభాగాలలో అత్యంత ప్రతిభ కనబరిచి పాఠశాలకు చెందిన 7గురు విద్యార్థులు జిల్లా ఛాంపియన్లుగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అబాకస్ విభాగాలలో బి. ప్రహర్ష, కె.అనన్య పాటిల్, వి. సాధ్వి, యస్. కార్తీక (విజువలైజేషన్), యస్. అధిత్య లు, వేదిక్ మ్యాథ్స్ విభాగంలో బి. లక్ష్మి ప్రసన్న, కె. రోహిత్, జి. అద్వైత్ రెడ్డిలు ఎంపిక కావడం జరిగింది. శుక్రవారం పాఠశాలలో రాష్ట్ర స్థాయి కి ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ప్రవేశ పత్రాలను అందించి ప్రశంశించి, రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించాలని సూచించారు. నిరంతర అభ్యాసం ద్వారానే గణితంలో ప్రవీణ్యం పొందవచ్చని, పోటీ పరీక్షలు విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తాయని ప్రిన్సిపాల్ నర్సయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ వారాహి మాతను దర్శించుకున్న విద్యార్థులు.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేట మండలం, లక్ష్మీపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు శుక్రవారం నగరంలోని శ్రీ వారాహి మాతను దర్శించుకున్నారు.

ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా లక్ష్మీపూర్ పాఠశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు నిజామాబాద్ నగరంలో నిర్మాణంలో ఉన్న శ్రీ వారాహి మాత దేవాలయాన్ని సందర్శించి భక్తి భావంతో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణ బాధ్యతలు నిర్వహిస్తున్న మంచాల జ్ఞానేందర్ ని కలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. దేవాలయ పురోహితులు విద్యార్థులకు ప్రత్యేక ఆశీర్వాదాలు అందిస్తూ, వారు మంచి విద్యాబుద్ధులతో ఉన్నత స్థాయికి ఎదగాలని అమ్మవారి కరుణ కలగాలని ఆశీర్వదించారు.విద్యార్థులు ఆలయ ప్రాంగణంలో భక్తి భావంతో పూజా కార్యక్రమాలలో పాల్గొనగా,

మంచాల జ్ఞానేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఫోటోలను వారికి అందజేశారు. ఈ ఆధ్యాత్మిక సందర్శనం విద్యార్థుల్లో భక్తి, నైతిక విలువలు, సత్సంకల్పాలను పెంపొందించేలా నిలిచిందని అధ్యాపకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరేందర్, కొత్త సురేష్, శ్రీకాంత్, తిరుపతి, శరత్, వనజలత, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందూరులో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ రాబోతుంది.





**17 ఏళ్లుగా అవినీతి సొమ్మును పోగు చేసుకుని పన్ను కట్టని అవినీతి పరుడు 19 డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి.**
**ఈ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పిసిసి అధ్యక్షుడు ఎన్ని కోట్లకు అమ్ముడుపోయాడో ప్రజలకు సమాధానం చెప్పాలి.**
**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ఇందూర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ రాబోతుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ అన్నారు. శుక్రవారం నగరంలోని పలు డివిజన్ లలో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 19 డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి 17 ఏళ్లుగా మున్సిపల్ కార్పొరేషన్ లో ఆస్తి పన్ను కట్టకుండా ఎగగొట్టి ఇప్పుడు కార్పొరేటర్ సీటు వచ్చిందని అక్షరాల 8 కోట్ల 16 లక్షల పైచిలుకు పన్ను కట్టిన అతను గెలిస్తే డివిజన్ కు డివిజన్ ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. అసలు ఆయనకు ఏం అనుభవం ఉందని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ టికెట్ ఇచ్చారని, ఎన్ని కోట్లకు మహేష్ కుమార్ అమ్ముడు పోయారని ఆరోపించారు. డివిజన్ లో ప్రజలకు డబ్బు ఆశ చూపి ఓట్లు వేయించుకునే కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అవినీతిపరుడైన ఆయన మరియు రాజకీయ పరిజ్ఞానం లేని ఆయన సతీమణికి ఏ విధంగా టిక్కెట్ ఇచ్చారో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఆయన ఒక వ్యాపారవేత్త అని ప్రజలు అతనిని గెలిపిస్తే రాజకీయాలను వ్యాపారంగా మార్చి, ఇందూరును పూర్తిగా కబ్జా చేసి, ఎక్కడపడితే అక్కడ తమ వ్యాపార సామ్రాజ్యాలు విస్తరింప చేస్తారని ఆరోపించారు. ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి, బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.


# వాట్సాప్ మీ సేవకు ఆదరణ

**3.25 లక్షల మందికి డిజిటల్ పౌర సేవలు**

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ మీ సేవ విధానానికి అత్యధిక ప్రజాదరణ లభించిందని సర్కార్ శుక్రవారం వెల్లడించింది. దీంతో ఇప్పటివరకూ 3.25 లక్షల మందికి డిజిటల్ పౌర సేవలు అందినట్లు వివరించింది. ఈ వాట్సాప్‌లో 4.5 లక్షల మంది నమోదు చేసుకోగా.. 3.25 లక్షల మంది ఈ సేవలు పొందినట్లు గణాంకాలతో సహా విశదీకరించింది. కాగా, 24 గంటలపాటు 8096958096 వాట్సాప్ నంబర్ ద్వారా సేవలు అందిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. పది కంటే ఎక్కువ శాఖలకు చెందిన 581 రకాల సేవలను ఈ వాట్సాప్ నెంబర్ ద్వారా అందుబాటులో తీసుకువచ్చింది. క్యాస్ట్, ఆదాయం, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం ఈ వాట్సాప్ నెంబర్‌ను అత్యధికంగా వినియోగించినట్లు గుర్తించింది. మీ సేవా స్టేటస్, సర్టిఫికేట్ డౌన్‌లోడ్ అన్నీ వాట్సాప్‌లోనే పొందవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. పదే పదే మీ సేవా కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా వాట్సాప్ ద్వారా ఈ సేవలు అందిస్తోందని వివరించింది. 2025 నవంబర్ 18వ తేదీన ఈ సేవలను తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రారంభించారు. డిజిటల్ అవగాహన లేని వారికీ సులభంగా ఈ సేవలు అందిస్తోంది. అలాగే ఈ వాట్సాప్ మీ సేవ ద్వారా 31 దేవాలయ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దేవుని దర్శనం, వసతితోపాటు సేవలన్నీ ఈ వాట్సాప్‌లోనే బుకింగ్ చేసుకునే అవకాశాన్ని ఈ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక రానున్న రోజుల్లో 108, 101, 102 ఎమ్జర్గ÷న్సీ సేవలను సైతం ఈ వాట్సాప్ నెంబర్‌కు అనుసంధానం చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 5వేలకు పైగా ఉన్న మీ సేవా కేంద్రాల్లో రోజుకు 80 వేల నుంచి లక్ష మంది వరకూ సేవలు పొందుతున్నారు. 2023 నవంబర్ 1 నుంచి 2026 జనవరి 31వ తేదీ వరకూ 5.98 కోట్ల లావాదేవీలు జరిగాయని తెలిపింది.

# గ్రామసభలో స్టాళ్లను పరిశీలించిన చంద్రబాబు

**గ్రామ స్థాయి ఆర్థిక లెక్కలపై సీఎం చంద్రబాబు అసహనం**



కర్నూలు:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా 'మీ భూమి ? మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని, రాజముద్రతో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం రైతుల్లో హర్షాతిరేకాలను కలిగించింది. గ్రామసభా ప్రాంగణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. రైతులు, గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. భూ హక్కులు, భూ రికార్డుల తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయి ఆర్థిక లెక్కలపై సీఎం చంద్రబాబు అసహనం వ్యక్తం చేశారు. 'తలసరి ఆదాయం వివరాలన్నీ ముందుగానే నేను చదువుకొని వచ్చాను' అని పేర్కొంటూ, కాకి లెక్కలు కాకుండా కరెక్ట్ డేటా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సిరికి సీఎం చంద్రబాబు స్పష్టంగా సూచించారు. అధికారులు సమగ్ర అవగాహనతో, బాధ్యతగా సమాచారం ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులకు కూడా ఆర్థిక అంశాలపై పూర్తి అవగాహన ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సరైన డేటా, స్పష్టమైన విశ్లేషణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బుడగ జంగాల అంశంపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని గతంలోనే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించానని తెలిపారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం చట్టం చేయాల్సి ఉందని స్పష్టం చేశారు. ఎస్సీలకు రిజర్వేషన్లు మినహా అందే అన్ని ప్రయోజనాలు బుడగ జంగాలకూ అందేలా నిన్ననే సంతకం చేశానని వెల్లడించారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చేంత వరకు వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.



# 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ఈనెల 12న దేశవ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు ఇతర ప్రజానీకం తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. శిర్ప హనుమాన్లు అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, పెన్షనర్లకు నష్టదాయకమైన వ్యాలిడేషన్ ఆఫ్ టెన్షన్ చట్టాన్ని రద్దు చేయాలని, సీనియర్ సిటిజెన్లకు రైల్వే ప్రయాణంలో రాయితీలు కల్పించాలని, పెన్షనర్లకు ఇన్కమ్ టాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఈపీఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూపాయలు తొమ్మిది వేలు చెల్లించాలని, సొంత ఇల్లు లేని రిటైర్డ్ ఉద్యోగులకు సొంత ఇంటి కలను నెరవేర్చాలని, తదితర డిమాండ్ల సాధనకై ఈ సార్వత్రిక సమ్మెలో రిటైర్డ్ ఉద్యోగులు కూడా పాల్గొంటున్నారని వారి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఈవీఎల్ నారాయణ, జిల్లా నాయకులు జార్జ్, లావు వీరయ్య, ప్రసాదరావు, పుష్పలీల, లలిత, చంద్రశేఖర్, నరేందర్, బాల దుర్గయ్య, రాజేశ్వర్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉంటా.

**- 6వ డివిజన్ స్వతంత్ర అభ్యర్థి సబిత సిద్దిరాములు.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

వినాయక్ నగర్ కాలనీ వాసినైన తాను, నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తానని ఆరవ డివిజన్ స్వతంత్ర అభ్యర్థి సిరిగాధ సబిత సిద్దిరాములు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం డివిజన్ పరిధిలోని కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ, పాలక పార్టీలు వినాయక నగర్ ప్రాంత సమస్యలను పూర్తిగా విస్మరించారని అన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో కాలనీ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజలు బ్యాట్ గుర్తుకు ఓటు వేసి, తనను ఆదరించి గెలిపిస్తే ప్రజల అన్ని రకాల సమస్యల పరిష్కారంకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికంగా ఉండనీ వారిని ప్రజలు తిరస్కరించాలని, అలాగే కేవలం రాజకీయాల కోసం పోటీ చేస్తున్న వారికి ఆదరించవద్దని కోరారు.


# మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీ

**ముహూర్తం కోసం ఎదురుచూస్తున్న తెలంగా జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్: మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు.ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నాన న్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇదిలావుంటే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై జాగృతి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

# రేవంత్‌పై ఎన్నికల పిటిషన్

**రేవంత్ అభ్యర్థనకు హైకోర్టు తిరస్కరణ**



హైదరాబాద్: హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. 2023లో భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభలో తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు కాగా, వాటిని రద్దు చేయాలంటూ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అయితే ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్న న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

వేగుచుక్క

# సోలో హీరోగా



రెబల్ స్టార్ కృష్ణంరాజు నట వారసుడిగా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చి 'బాహుబలి'తో పాన్ ఇండియా సూపర్‌స్టార్‌గా ఎదిగాడు ప్రభాస్ . ఆ తర్వాత ఆయన్నుంచి వస్తోన్న చిత్రాలన్నీ పాన్ ఇండియా రేంజులో ప్రేక్షకుల్ని అలరిస్తూనే ఉన్నాయి. సినిమా సినిమాకీ తన రేంజు పెంచుకుంటూ పాన్ ఇండియా నుంచి పాన్ వరల్డ్ హీరో స్థాయికి చేరుకున్నారు. కేవలం ఇండియాలోనే కాకుండా విదేశాల్లోనూ తిరుగులేని స్టార్‌డమ్ సొంతం చేసుకున్న ప్రభాస్ నుంచి సినిమా వస్తుందంటే సినీ లవర్స్‌కి పండగే. ఇప్పటికే అంతర్జాతీయంగా ఎన్నో రికార్డులు తన సొంతం చేసుకున్న ప్రభాస్ మరో అరుదైన ఘనత ముంగిట నిలిచారు.

జపాన్‌కు చెందిన ప్రఖ్యాత అనన్ మ్యాగజైన్ కవర్ పేజీపై కనిపించనున్న తొలి భారతీయ సోలో హీరోగా ప్రభాస్ చరిత్ర సృష్టిస్తున్నారు. ఈ నెల 10న విడుదల కానున్న ఆ మ్యాగజైన్‌లో, ప్రభాస్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదరణను, ముఖ్యంగా జపాన్ ప్రేక్షకుల్లో ఆయనకు ఏర్పడిన అభిమానాన్ని అందులో ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు సమాచారం. గతంలో 'ఆర్‌ఆర్‌ఆర్' విడుదల అనంతరం రామ్‌చరణ్, ఎన్టీఆర్ కలిసి ఆ మ్యాగజైన్ కవర్‌పై కనిపించగా, ఇప్పుడు ప్రభాస్‌కు సోలోగా ఆ గౌరవం దక్కడం విశేషం. ఇప్పటికే ఆ కవర్ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది.

ప్రభాస్‌కు జపాన్‌లో ఈ స్థాయి క్రేజ్ రావడానికి ప్రధాన కారణం 'బాహుబలి' సిరీస్. ఆ సినిమాల తర్వాత ఆయనకు అక్కడ భారీ ఫ్యాన్‌బేస్ ఏర్పడింది. అప్పటి నుంచే ప్రభాస్ సినిమాలు జపాన్‌లో కూడా విడుదలవుతూ మంచి ఆదరణ పొందుతున్నాయి. ఇటీవల విడుదలైన 'కల్కి 2898 ఏడీ' కూడా అక్కడ విజయవంతంగా ప్రదర్శితమైంది. ఆ ప్రమోషన్స్ సమయంలోనే ప్రభాస్ త్వరలో జపాన్ వస్తానని అభిమానులకు మాట ఇచ్చారు. ఆ మేరకే గత డిసెంబరులో ఆయన టోక్యో పర్యటన చేపట్టారు. 'బాహుబలి: ది ఎపిక్' ప్రత్యేక ప్రదర్శనల సందర్భంగా జరిగిన ఈ పర్యటనలో, అభిమానుల ప్రేమాభిమానాలను చూసి ప్రభాస్ భావోద్వేగానికి గురయ్యారు. "కొన్నిచ్చివా" అంటూ జపాన్ భాషలో అభిమానులను పలకరించడం అక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదే సమయంలో ఈ మ్యాగజైన్ కవర్ ఫొటో షూట్ కూడా జరిగినట్లు తెలుస్తోంది.

# హాట్ కేక్




నటసింహ బాలకృష్ణతో సినిమాలు రూపొందించాలని యంగ్ డైరెక్టర్స్ ఉవ్విళ్ళూరుతున్నారు. ప్రస్తుతం గోపీచంద్ మలినేని డైరెక్షన్ లో బాలయ్య హీరోగా ఓ మూవీ రూపొందనుంది. ఈ సినిమా తరువాతి ప్రాజెక్ట్ కోసం పలువురు డైరెక్టర్స్ పేర్లు వినిపిస్తున్నాయి.

బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న చిత్రం మార్చి 19వ తేదీ నుండి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది. ఈ లోగా గోపీచంద్ తన స్క్రిప్ట్ ను మరింత పటిష్టం చేసుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

యాక్షన్ డ్రామాలో ఫ్యామిలీ సెంటిమెంట్ తో ఈ మూవీ రూపొందనుంది. ఈ చిత్రం తరువాత బాలయ్య నటించే సినిమా ఏది అన్న అంశంపై పలు వార్తలు వినిపిస్తున్నాయి. బాలయ్య హీరోగా మళయాళ చిత్రం 'మార్కో' డైరెక్టర్ హనీఫ్ అదేని డైరెక్షన్‌లో దిల్ రాజు ఓ సినిమా నిర్మించనున్నారని టాక్. తరువాత హరీశ్ శంకర్ దర్శకత్వంలోనూ బాలయ్య ఓ సినిమా చేస్తారనీ వినికిడి. 'బ్రోచేవారెవరురా, అంటే సుందరానికి' చిత్రాలు రూపొందించిన వివేక్ ఆత్రేయ కూడా బాలయ్య కోసం ఓ సబ్జెక్ట్ తయారు చేశారని, దానిని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తారనీ ఓ వార్త చక్కర్లు కొడుతోంది. అలాగే బాలయ్యతో 'డాకూ మహరాజ్' నిర్మించిన సూర్యదేవర నాగవంశీ కూడా మరో సినిమాను ప్లాన్ చేస్తున్నారని టాక్. ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తారనీ సమాచారం. ఇలా బాలయ్య చుట్టూ నలుగురు దర్శకుల పేర్లు సందడి చేస్తున్నాయి. బాలకృష్ణతో దర్శకులు పనిచేయడానికి ఉత్సాహం ప్రదర్శిస్తూ ఉంటారు. ఎందుకంటే బాలయ్య ఒక్కసారి సబ్జెక్ట్ విని ఓకే చెప్పిన తరువాత, మేకింగ్ టైమ్ లో ఏలాంటి మార్పులూ చేర్పులకు అవకాశం ఇవ్వరు. అంతేకాదు, సబ్జెక్ట్ విషయంలో ఆ పై ఆయన ఏలాంటి జోక్యం చేసుకోరు. అలా బాలయ్య దగ్గర దర్శకులకు ఫ్రీడమ్ లభిస్తుందని అందరూ అంటూ ఉంటారు. అందువల్లే బాలయ్యతో పనిచేయడానికి డైరెక్టర్స్ ఆసక్తి చూపిస్తూంటారు. ప్రస్తుతం బాలయ్యతో సినిమాలు తీయడానికి ఉత్సాహం చూపిస్తున్న వారెవరు? అంటే వివేక్ ఆత్రేయ, హరీశ్ శంకర్, కొరటాల శివ, మళయాళ డైరెక్టర్ హనీఫ్ అని వినిపిస్తోంది. ప్రయోగాలకు వెళ్ళకుండా, అందరినీ ఆకట్టుకొనేలా ఓ ఫ్యామిలీ డ్రామాకు యాక్షన్, సెంటిమెంట్ మిళితం చేసి సేఫ్ ప్రాజెక్ట్ ను తెరకెక్కించే ప్రయత్నం చేస్తున్నారు. ఉగాది నుండి ఈ సినిమా షూటింగ్ సాగనుంది. త్వరగా ఈ చిత్రాన్ని పూర్తి చేసి దసరా కానుకగా రిలీజ్ చేయాలని సంకల్పించారు. పైగా ఇందులో వీఎఫ్ఎక్స్ వర్క్ అంతగా లేకపోవడంతో, అనుకున్న సమయానికే సినిమా పూర్తవుతుందనీ పరిశీలకులు చెబుతున్నారు.

# వెంకీ విలన్‌గా



మన శంకరవరప్రసాద్ గారు సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు అనిల్ రావిపూడి తన తరువాత సినిమాను విక్టరీ వెంకటేష్‌తో చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించిన విషయం తెల్సిందే. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులలో బిజీగా ఉన్న అనిల్.. ఈ సినిమా కోసం కూడా స్టార్స్ ని రంగంలోకి దింపుతున్నట్లు తెలుస్తోంది. కొన్నిరోజుల నుంచి వెంకీ– అనిల్ చిత్రంలో తమిళ్ హీరో కార్తీ నటిస్తున్నాడని వార్తలు వినిపించాయి. కానీ, ఇప్పుడు ఆ ప్లేస్ లో మలయాళ హీరో ఫహాద్ ఫాజిల్ నటిస్తోన్నట్లు సమాచారం.

పుష్ప సినిమాతో తెలుగువారికి సుపరిచితుడిగా మారారు ఫహాద్ ఫాజిల్. ఈ సినిమా ఆయనకు మంచి గుర్తింపును తీసుకొచ్చింది. పుష్ప 2 తరువాత ఫహాద్ ఫాజిల్ తెలుగులో నటించలేదు. కథలను ఆచితూచి ఎంచుకొనే ఈ మలయాళ హీరో దగ్గరకు అనిల్ వెళ్లి కథను వినిపించారని, ఆ కథ నచ్చడంతో వెంటనే ఫహాద్ కూడా ఓకే చెప్పినట్లు టాక్. ప్రస్తుతం అగ్రిమెంట్ పనులు నడుస్తోన్నాయని, త్వరలోనే మేకర్స్ అధికారికంగా ఫహాద్ ఫాజిల్ ను సినిమాలోకి ఆహ్వానించనున్నారని సమాచారం.

ఇప్పటికే వెంకీ– అనిల్ కాంబోలో మూడు సినిమాలు వచ్చాయి. మూడు కూడా మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు వస్తోన్న ఈ నాలుగో సినిమాపై కూడా అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. ఇక ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో ఫహాద్ ఫాజిల్ కూడా భాగం అవుతుండడంతో మరింత ఆసక్తి నెలకొంది. అందులోనూ ఈ చిత్రంలో ఫహాద్.. వెంకీకి విలన్ గా నటిస్తున్నాడని టాక్ నడుస్తోంది. అదే నిజమైతే వెంకీ– ఫహాద్ కి మధ్య సీన్స్ చాలా రసవత్తరంగా ఉండబోతున్నాయని ఫ్యాన్స్ మాట్లాడుకుంటున్నారు.

# ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్..



కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా గుర్తింపును సంపాదించుకుని ఎప్పటికప్పుడు వైవిధ్యమైన చిత్రాలతో ప్రేక్షకులను మెప్పిస్తున్న శ్రీవిష్ణు కాస్త గ్యాప్ తర్వాత రూట్ మార్చి నటించిన చిత్రం 'మృత్యుంజయ్'. ఇప్పటివరకు యూత్, కామెడీ సినిమాలతో అలరించిన ఈ హీరో ఇప్పుడు ఫస్ట్ టైం ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ఎదుటకు వచ్చేందుకు రెడీ అయ్యాడు. హుస్సేన్ షా కిరణ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా రమ్య గున్నం సమర్పణలో లైట్‌బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బ్లాక్ బస్టర్ మూవీ 'సామజవరగమన' మూవీ తర్వాత రేబా మోనికా జాన్ మరోసారి శ్రీ విష్ణు సరసన కథానాయికగా చేస్తోంది. అయితే.. ఇప్పటి వరకు ఈ మూవీ నుంచి ఎలాంటి అప్డేట్స్ లేకపోవడంతో వేసవిలో వస్తెందేమో అనుకుంటున్న సమయంలో సడన్‌గా ఈ మూవీ రిలీజ్ డేట్ ప్రకటించి మేకర్స్ షాక్ ఇచ్చారు. ఈ సినిమాను ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 27న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్‌ను గమనిస్తే.. పేపర్లతో నిండిన రోడ్డుపై శ్రీవిష్ణు ఒంటరిగా నిలబడి ఉండి దేని కోసమో వెతుకుతున్నట్లుగా ఉండి ఆసక్తికరంగా ఉంది.

ఇదిలాఉంటే శ్రీ విష్ణు నటించిన మరో చిత్రం విష్ణు విన్యాసం ఈ నెలలోనే రిలీజ్ ఉంటుందని ప్రకటించిన మేకర్స్ సడన్‌గా ఈ మూవీ రిలీజ్ కానుండడంతో ఇప్పుడు ఇప్పటికే ప్రకటించిన ఈ విష్ణు విన్యాసం చిత్రం వాయిదా పడే అవకాశం ఉంది. శ్రీకర్ ప్రసాద్ ఈ చిత్రానికి ఎడిటర్‌గా వర్క్ చేయగా, కాల భైరవ సంగీతం సమకూర్చాడు.

# ప్రతిబింబం



భూమిక ప్రధాన పాత్రలో సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి కీలక పాత్రలు పోషించిన చిత్రం 'యుఫోరియా'. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మాతలుగా డైరెక్టర్ గుణశేఖర్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని నేడు విడుదల చేయబోతున్నారు. ఈ క్రమంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ అత్యంత వైభవంగా నిర్వహించారు. డైరెక్టర్ గుణ శేఖర్ మాట్లాడుతూ,'1992లో 'లాఠీ' చిత్రంతో ఇండస్ట్రీలోకి వచ్చాను. ఇన్నేళ్ల కెరీర్‌లో ఇది నా 14వ సినిమా. నా మొదటి చిత్రానికి ఎలా ఫీల్ అయ్యానో ఇప్పుడు కూడా అదే ఫీల్‌తో ఉన్నాను. ఓ మంచి కథను, కొత్త కథను మరింత కొత్తగా చెప్పే ప్రయత్నం చేశాను. నేను ప్రేక్షకుల దేవుళ్లని నమ్ముతాను. నేను వారి టైంకి, డబ్బుకి, విజ్ఞతకి విలువ ఇస్తాను. నేను వాటిని దృష్టిలో పెట్టుకునే ఈ మూవీని తెరకెక్కించాను. నేను ప్రేక్షకుల డబ్బుని, సమయాన్ని వృథా చేయను. ఇదొక ఫ్యామిలీ ప్రొడక్ట్‌లా తీశారని చాలా మంది మెచ్చుకున్నారు. ఈ కథకు సారా అర్జున్ ఆత్మ. ఆమె ఒప్పుకుంటేనే మూవీ తీయాలని అనుకున్నాను. సినిమా చూశాక ఆ విషయం ఆడియెన్స్‌కి అర్థం అవుతుంది. ఈ సినిమాకి భూమిక బ్యాక్ బోన్. ఆమె చాలా స్ట్రాంగ్ పర్సన్. వింధ్య వేములపల్లి పాత్రలో ఆమె జీవించారు. విఘ్నేశ్ ఈ సినిమాకి బ్రెయిన్ లాంటివాడు. ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టేలా ఈ మూవీ ఉందని చూసిన వారంతా ప్రశంసించారు. పృథ్వీ సైతం పాత్రకు తగ్గట్టుగా అద్భుతంగా నటించాడు. స్పాయిల్ కిడ్స్‌ని చూపించేలా రూపొందించిన పాత్రలో లిఖిత గొప్పగా నటించారు. అడాల్‌సెన్స్, పేరెంటింగ్, సోషల్ ఇంపాక్ట్ అనే అంశాలతోనే ఈ చిత్రాన్ని తెరకెక్కించాను. నా మేధస్సుని ఉపయోగించి కాకుండా ఓ సాధారణ వ్యక్తిలా, సమాజాన్ని చూసిన వ్యక్తిగా ఈ మూవీని తీశాను. తెలుగు టైటిల్ పెట్టనందుకు నన్ను క్షమించండి. సినిమా చూసిన తరువాత 'యుఫోరియా' టైటిల్ కరెక్ట్‌గా సెట్ అయిందని అంటారంతా. సమాజంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా ఈ కథను అల్లుకున్నాను. ప్రవీణ్ కెమెరా వర్క్ చాలా కొత్తగా ఉంటుంది. కాలభైరవ బీజీఎం అదిరిపోతుంది.

తండ్రికి తగ్గ తనయుడు అని కాలభైరవ నిరూపించుకుంటాడు. మేం కుటుంబ సమేతంగా ఈ మూవీని నిర్మించాం. ఈ చిత్రాన్ని యూత్, పేరెంట్స్ ఇలా అందరూ వీక్షిస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. 'ఇలాంటి చిత్రాలను చేయాలంటే చాలా ధైర్యం ఉండాలి. ఇలాంటి చిత్రాల్లో రిస్క్ ఎంతో ఉంటుంది. కానీ గుణశేఖర్, ఆయన ఫ్యామిలీ కలిసి రిస్క్ చేస్తున్నారు. నేను ఆల్రెడీ ఈ మూవీని చూశాను. రాత్రంతా ఈ మూవీ నన్ను వెంటాడుతూనే ఉంది. ఈ మూవీని అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని భూమిక చెప్పారు.

# కామెడీ డ్రామా



టాలీవుడ్‌లో వైవిధ్యమైన సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేష్, నారా రోహిత్ కాంబినేషన్‌లో కొత్త మల్టీస్టారర్ సినిమా రాబోతోందన్న టాక్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాకు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహించనున్నట్లు సమాచారం. పూర్తి స్థాయి కామెడీతో పాటు భావోద్వేగాలకు చోటు ఉన్న కథతో ఈ చిత్రం తెరకెక్కనున్నట్లు ప్రచారం. ఇటీవలి కాలంలో సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న ఈ ఇద్దరు హీరోలకు, ఈ కాంబినేషన్ సినిమా కెరీర్‌లో కీలక మలుపుగా మారుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇద్దరికీ నటులుగా మంచి పేరు ఉన్నప్పటికీ, ఇటీవలి కాలంలో ఆశించిన స్థాయిలో కమర్షియల్ హిట్స్ మాత్రం దక్కలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు వీరిద్దరి కాంబినేషన్‌లో ఓ మల్టీస్టారర్ సినిమా రాబోతోందన్న వార్త ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చకు దారితీసింది. అల్లరి నరేష్, నారా రోహిత్ కలిసి ఓ పూర్తి స్థాయి కామెడీ ఎమోషనల్ ఎంటర్‌టైనర్‌లో నటించనున్నట్లు టాలీవుడ్‌లో టాక్ బలంగా వినిపిస్తోంది. ఈ చిత్రానికి వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహించనున్నట్లు టాక్. ఇప్పటికే నారా రోహిత్‌తో 'సుందరకాండ' వంటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని తెరకెక్కించిన ఆయన, ఇప్పుడు అల్లరి నరేష్‌ను కూడా జతచేసి మల్టీస్టారర్‌కు సిద్ధమవుతున్నారట. ఈ చిత్రాన్ని హరీష్ పెద్ది నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి సంబంధించి హీరోల మధ్య చర్చలు జరిగాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. కామెడీతో పాటు ఎమోషన్స్ బాగా దట్టించి అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా వెంకటేష్ నిమ్మలపూడి కథని సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక నారా రోహిత్ విషయానికి వస్తే... కెరీర్ ప్రారంభం నుంచే వైవిధ్యమైన పాత్రలతో ప్రత్యేకమైన ఇమేజ్ తెచ్చుకున్నారు. మధ్యలో కొంత గ్యాప్ తీసుకున్న ఆయన, గతేడాది 'భైరవం', ఆ తర్వాత 'సుందరకాండ'తో తిరిగి ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ప్రస్తుతం వెంకటేష్–త్రివిక్రమ్ కాంబోలో తెరకెక్కుతోన్న 'ఆదర్శ కుటుంబం' సినిమాలో నెగెటివ్ షేడ్స్ ఉన్న పోలీస్ పాత్రకు ఓకే చెప్పారన్న టాక్ కూడా వినిపిస్తోంది.



# ఫ్యామిలీ డ్రామా

యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా 'సీతా పయనం' ఫిబ్రవరి 14, 2026న వాలంటైన్స్ డే కానుకగా విడుదల కానుంది. ఈ చిత్రంతో ఆయన కుమార్తె ఐశ్వర్య అర్జున్ హీరోయిన్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. నిరంజన్ సుధీంద్ర హీరోగా నటిస్తుండగా, ప్రకాష్ రాజ్, సత్యరాజ్, కోవై సరళ కీలక పాత్రలు పోషించారు. ధ్రువ సర్జా ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన ఈ సినిమా, ప్రేమ, కుటుంబ విలువల నేపథ్యంలో సాగే కథతో ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా తెరకెక్కినట్లు యూనిట్ చెబుతోంది.

యాక్షన్ కింగ్‌గా దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అర్జున్ సర్జా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం ' సీతా పయనం '. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ సినిమా ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంతో అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్‌ను తెలుగు తెరకు హీరోయిన్‌గా పరిచయం కాబోతున్నారు.. ఇప్పటికే పలు భాషల్లో నటుడిగా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ ఈ రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామాని దర్శకుడిగా ఎలా డీల్ చేశారన్నది ఆసక్తికరంగా మారింది.



# 90 % ఫేక్



హిట్ 3 గతేడాది రిలీజైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ యాక్టర్ ప్రతీక్ స్మితా పాటిల్ విలన్‌గా నటించాడు. అతనికి మంచి గుర్తింపు కూడా వచ్చింది. ప్రతీక్.. దివంగత నటి స్మితా పాటిల్ కుమారుడు. హిట్3 తరువాత వరుస అవకాశాలను అందుకొంటున్న ప్రతీక్ ఈ మధ్యనే నటి ప్రియా బెనర్జీ ని రెండో వివాహం చేసుకున్నాడు. పెళ్లి తరువాత ప్రతీక్–ప్రియా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ ఇంటర్వ్యూలో వీరు బాలీవుడ్ ఇండస్ట్రీలో జరిగే వివాహాలు 90 శాతం వరకు ఫేక్ అని చెప్పడం హాట్ టాపిక్ గా మారింది. ఇండస్ట్రీలో తాము ఉన్నాం కాబట్టి నిజం చెప్తున్నామని, ఇక్కడ ఒకరినొకరు మోసం చేసుకుంటున్నారని వారు తెలిపారు. ముఖ్యంగా ప్రతీక్ మాట్లాడుతూ.. 'బయట ఉండే ప్రజలకు లోపల ఏం జరుగుతుందో వాస్తవాలు తెలియవు. అవి ఇండస్ట్రీలో ఉన్నవారికి మాత్రమే తెలుస్తాయి. ఏదోరోజు అవన్నీ కథ, సినిమా, డాక్యుమెంటరీ రూపంలో ప్రజలకు తెలుస్తాయి. బాలీవుడ్ లో పెళ్ళిళ్ళు 90 శాతం ఫేక్. వారందరూ పెళ్ళిని జోక్ గా చూస్తారు. రాత్రి అయిపోతే.. విషయం అయ్యినట్టే అని పెళ్ళైనవాళ్ళే చెప్తున్నారు. ఇదంతా మేము ఇండస్ట్రీలో ఉన్నాం కాబట్టి మాకు తెలిసింది. పెళ్ళి పేరుతో ఒకరినొకరు మోసం చేసుకుంటున్నారు.